క్లుప్తంగా

రామలింగేశ్వరుని సేవలో లోకాయుక్త జడ్జి



క్షీరారామలింగేశ్వరస్వామి సన్నిధిలో లోకాయుక్త జడ్జి రజని దంపతులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జడ్జి పి.రజని దంపతులు దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన రజని దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ జిల్లా అధికారి ఈవీ సుబ్బారావు, తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్, ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, ఏఎస్సై మార్‌లింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కి దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలి

పాలకొల్లు అర్బన్: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఇ.నారాయణ శనివారం పాలకొల్లులో మంత్రి నిమ్మలను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఏ సమస్యలు తలెత్తినా వాటి పరిష్కారానికి ప్రత్యేక దృష్టిపెట్టాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, మండల విద్యాశాఖాధికారులు గుమ్మళ్ల వీరాస్వామి, ఆర్ఎన్‌వీఎస్ గంగాధరశర్మ ఆయన వెంట ఉన్నారు.

ఘాట్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి



వలందర్‌రేవు వద్ద పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: కార్తీకమాసం పురస్కరించుకుని పట్టణంలో గోదావరి రేవులను ఎప్పటికప్పుడు బాగు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గోదావరి ఘాట్‌ల వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ కార్తీకమాసంలో వలందర్‌రేవు, లలితాంబ ఘాట్, అమరేశ్వర ఘాట్‌ల వద్ద ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. తెల్లవారుజామునే స్నానాలు నిమిత్తం భక్తులు వస్తున్న నేపథ్యంలో రేవుల వద్ద లైటింగ్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. గోదావరిలో నీరు తక్కువగా ఉన్నప్పుడు వలందర్‌రేవులో జల్లు స్నానం చేయడానికి వీలుగా మోటార్లు రిపేర్లు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్ ఉన్నారు.

అవినీతిని అరికట్టడంలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ

నరసాపురం: సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న అవినీతిని అరికట్టడంలో యువత, ముఖ్యంగా విద్యార్థులు కీలకపాత్ర పోషించాలని నరసాపురం అదనపు ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. శనివారం వైఎన్ కళాశాలలో విజిలెన్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల సామాజికసేవా విభాగం, ఐక్యూఏసీ, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ అవినీతి అనేది కేవలం ప్రభుత్వ ఉద్యోగుల్లో మాత్రమే లేదన్నారు. అన్నిరంగాల్లో వివిధ రూపాల్లో అవినీతి ఉందన్నారు. విజిలెన్స్ అంటే తనిఖీ అనే అర్థం వస్తుందని వివరించారు. మన చుట్టుపక్కల జరుగుతున్న అన్యాయాలపై విద్యార్థులు దృష్టి సారించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, పీజీ డైరెక్టర్ ఆర్.పార్థసారథి, డీన్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

పెనుగొండ: ఆచంట మండలం కొరుగోరు మిల్లిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు ఆచంట ఎస్సై వెంకటరమణ తెలిపారు. శనివారం రాత్రి వై.రంగారావు అలియాస్ బాబులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో వీఆర్‌ఓ అతడిని పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు .ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

రేషన్ వాహనాలు కొనసాగేనా?

వాహనాల కొనసాగింపుపై కొరవడిన స్పష్టత



ఎండీయూ వాహనం

యలమంచిలి: రేషన్ సరుకులు సరఫరా వాహనాలు (ఎండీయూ) కొనసాగింపుపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకపోవడంతో ఎండీయూ వాహన నిర్వాహకులంతా ఆందోళన చెందుతున్నారు. పేదలు, వృద్ధులు, మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేర్చింది. ముఖ్యంగా రేషన్‌కార్డుదారులు ఇబ్బందులు పడకుండా మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులు అందజేసింది. దీంతో రేషన్ సరుకులు తీసుకునే వృద్ధులు, దివ్యాంగులకు ఎంతో మేలు జరిగింది. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకానికి మంగళం పాడేందుకు సిద్ధమైంది. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలను రేషన్ డీలర్లుగా నియమించి వారికి లబ్ధి చేకూర్చేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే ఎండీయూ వాహనాలను పక్కన పెట్టేందుకు సిద్ధమైంది. అదే జరిగితే మళ్లీ రేషన్ షాపుల వద్ద జనం బారులు తీరాల్సి ఉంటుంది.

నిర్వీర్యం దిశగా అడుగులు

ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించడం వల్ల దివ్యాంగులు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని, రేషన్ సరుకుల కోసం ఎవరూ పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఉండదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భావించారు. అధికారంలోకి రాగానే ఎండీయూ వాహనాల ద్వారా ప్రజా పంపిణీలో నవశకానికి నాంది పలికారు. మన రాష్ట్రంలో అమలు చేసిన ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ విధానాన్ని దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకున్నాయి. పేదలకు ముంగిళ్లలో సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందిన పథకం గడచిన ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. కానీ తాజాగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

పకడ్బందీగా ఇంటింటికీ రేషన్ అమలు

పేదలకు దూరాభారం, రేషన్ దుకాణంలో డీలర్ ఉంటేనే సరుకులు.. లేదంటే కష్టమనే పద్ధతికి స్వస్తి పలికేందుకు జగన్ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీకి 2021లో శ్రీకారం చుట్టింది. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17 వరకూ ఈ–పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేసింది. రేషన్ పంపిణీని సెంట్రల్ కమాండ్ కంట్రోలర్‌కు అనుసంధానం చేయడంతో పథకం పకడ్బందీగా నడిచింది. అలాగే రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ఎండీయూలకు సరకులను సరఫరా చేసే బాధ్యతలను ఆయా డీలర్లకు అప్పగించారు. దీంతో యువతకు ఉపాధి దొరికింది, ప్రజలకు నేరుగా ఇంటికే రేషన్ సరుకులు అందాయి. డీలర్లకూ ఎటువంటి ఇబ్బందీ కలగలేదు.

2027 వరకూ ఒప్పందం

ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీలో భాగంగా ఎండీయూ నిర్వాహకులకు 2027 వరకూ ఒప్పందం ఉంది. వాహనాల వాయిదాలు సైతం అప్పటి వరకూ చెల్లించాల్సి ఉంది. ఎండీయూ వాహనం ధర రూ.5.80 లక్షలు కాగా, అందులో 10 శాతం లబ్ధిదారులు చెల్లించారు. మిగిలినది ప్రభుత్వం చెల్లించింది. ఎండీయూ నిర్వాహకుడు నెలకు రూ.3 వేలు చెల్లిస్తుండగా, మిగిలిన రూ.8 వేలు ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తోంది. ఈ పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందాన్ని ఏం చేస్తారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. తమ ఉపాధిని దెబ్బతీసి మా కుటుంబాలను రోడ్డున పడేయవద్దని వేడుకుంటున్నారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి



వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఇంటి వద్దే రేషన్ పథకాన్ని కొనసాగించాలి. ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యాన్ని అందజేయాలి. ఈ వాహనాలు తీసివేస్తే ఆసరాలేని వృద్ధులు, దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు పడతారు. రేషన్ షాపు వరకూ వెళ్లేందుకు తిప్పలు పడతారు. ప్రభుత్వం ఆలోచించి ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.

కుక్కల బాలచంద్రన్, మేడపాడు

బియ్యం ఇంటి వద్దే అందజేయాలి



రేషన్ సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దే అందజేయాలి. రేషన్ దుకాణాల వద్ద సరుకులిస్తే గంటల తరబడి క్యూలో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక్కోసారి కూలి పనులు కూడా వదులుకోవాల్సి వస్తుంది. అందువల్ల ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ అందించాలి. దీనివల్ల వాహన డ్రైవర్లకూ ఉపాధి లభిస్తుంది. ఎందరికో మేలు జరుగుతుంది.

– పులి సుబ్రహ్మణ్యం, కనకాయలంక

నేడు కార్తీక వనసమారాధన

నరసాపురం: పట్టణంలోని 12వ వార్డు పడుగలతోటలో ఆదివారం దేవాంగ కార్తీక వనసమారాధన ఏర్పాటు చేసినట్టు శ్రీచౌడేశ్వరిదేవి దేవాంగ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బల్ల రమేష్, కనకం ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. వనసమారాధనకు సంఘ రాష్ట్ర నాయకులు బీరక ప్రసాద్, ఉట్టి నాగసైనం తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

ఆచంటలో..

పెనుగొండ: ఆచంట శెట్టి బలిజ వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు కడలి రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆచంట వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణ, పలువురు ప్రముఖులు హజరవుతారన్నారు. సంఘ సభ్యులు అందరూ వనసమారాధనలో పాల్గొని ఐక్యతను చాటిచెప్పాలని కోరారు.

నేడు లయన్స్ క్లబ్ వార్షికోత్సవం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు అందించిన లయన్స్ క్లబ్, లయన్స్ ఐ హాస్పటల్ వేడుకలు నిర్వహించనున్నట్లు లయన్స్ అడ్మినిస్ట్రేటర్ ఎస్‌వీవీఎస్ పాపారావు నాయుడు అన్నారు. శనివారం స్థానిక రాజవల్లి రాధారమణ లయన్స్ ఐ ఆసుపత్రి ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాపారావు నాయుడు మాట్లాడుతూ ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక లయన్స్ కమ్యూనిటి హాలులో లయన్స్ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కె.శ్రీనివాస్

నరసాపురం: జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు కృషి చేయాలని నరసాపురం జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్ సూచించారు. డిసెంబర్ 14న జరగనున్న లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం కోర్టుహాల్లో పోలీసు అధికారులతో జడ్జి శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌ల వారీగా పెండింగ్ కేసులు, వాటిలో రాజీ పడదగిన కేసులు గుర్తించి ఇరుపక్షాలకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించాలని చెప్పారు. క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, భూతగాదాలు, చెక్‌బౌన్స్ కేసులు అన్ని రకాల కేసులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వడలిలో ఆరోగ్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: విష జ్వరాలు, కీళ్ల నొప్పులు ప్రబలుతున్న తరుణంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెనుగొండ కోలోకేటెడ్ పీహెచ్‌సీ సీహెచ్‌ఓ దానమ్మ తెలిపారు. శనివారం వడలి పంచాయతీ వద్ద ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వడలిలో 10 రోజుల పాటు హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది హెచ్‌వీ సుబ్బలక్ష్మీ, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సచివాలయ కార్యదర్శి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ రాజు

మొగల్తూరు: కార్తీకమాసంలో బీచ్‌లకు వచ్చే సర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్‌డీఓ దాసి రాజు అధికారులను ఆదేశించారు. శనివారం కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌ల ప్రాంతంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్ ప్రాంతాలలో పర్యాటకులు సముద్రం లోపలకు వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సముద్రస్నానం అనంతరం మహిళలు బట్టలు మార్చుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లు కూడా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బారికేడ్లు దాటి వెళ్లకుండా గజ ఈతగాళ్లను, పోలీస్ సిబ్బందిని నియమించాలన్నారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులకు తాగునీటి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో తాగునీటిని అందించాలన్నారు. పోలీసులు సూచించిన ప్రాంతంలోనే వాహనాలు నిలిపివేయాలని, ఏ ఒకక వాహనాన్ని బీచ్ రోడ్‌లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. ఆదివారం, బుధవారం, శనివారం రోజుల్లో పర్యటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున చెత్త, చెదారాలు లేకుండా ఎప్పటికప్పుడు వాటిని ఎత్తివేసేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏఎస్‌పీ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పిస్తున్నామని, సందర్శకుల రాకకు అనుగుణంగా తమ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటారన్నారు. తాము సూచించిన ప్రాంతంలోని సెల్ఫీలు దిగాలని, మద్యం తాగి బీచ్‌కు వచ్చే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పేరుపాలెం సౌత్, కేపీ పాలెం సౌత్ సర్పంచ్‌లు తిరుమాని విజయలక్ష్మి, అందే వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అందే ముక్తేశ్వరరావు, ఆంద్రాజు షరాబంద్ రాజు, తహసీల్దార్ ఎ.రాజకిశోర్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి, డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, రూరల్ సీఐ దుర్గాప్రసాద్, ఎస్సై వాసు, స్థానిక నాయకులు తిరుమాని నర్సింహస్వామి, మేకం బన్ను తదితరులు పాల్గొన్నారు.

కార్తీక పూజలు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పూజలు ప్రారంభమయ్యాయి. శనివారం వేకువజామున 5 గంటలకు గర్భాలయం ద్వారాలు తెరవగా ముందుగా గోవుతో స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఈ కార్తీకమాసం నెల రోజులు ఆలయం తెరిచిన వెంటనే ముందుగా గో దర్శనం కల్పించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు సన్నిది కృష్ణప్ప తెలిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ ముందుగా గో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. మొట్టమొదటి సారిగా ఆలయంలో నిర్వహించిన గో దర్శన పూజా కార్యక్రమాలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ఆలయ ప్రాకారంలో కార్తీక దీపాలను వెలిగించారు.

నిత్యాన్నదానం ప్రారంభం

కార్తీకమాసంలో క్షీరారామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం నిత్యాన్నదాన కార్యక్రమాన్ని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి కార్తీకమాస నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో ఆలయం పక్కనే ఉన్న రేపాక వారి సత్రంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం గత పదేళ్లుగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: కార్తీకమాసం ప్రారంభం కావడంతో శనివారం వేకువజాము నుంచి శివాలయాలు కిటకిటలాడాయి. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలోని భువనేశ్వరీ సమేత ముక్తేశ్వర స్వామి ఆలయం, పేరుపాలెంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, కాళీపట్నంలోని కాళికేశ్వర స్వామి ఆలయం, మొగల్తూరులోని పురాతన పార్వతీ విశ్వేశ్వర స్వామి ఆలయం, వనమల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక ప్రసాద్ నేతృత్వంలో ఆలయ అర్చకులు శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ నెల 4వ తేదీ మొదటి సోమవారం రోజున స్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించుకునేందుకు వీలుగా క్యూలైన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

పాలకొల్లు మండలంలో...

పాలకొల్లు అర్బన్: కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా శనివారం వాయు త్రిలింగ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు తెల్లవారుజామున పంట కాలువల్లో కార్తీక దీపాలు వదిలారు. ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ముఖమండపంలోని ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగించారు. శ్రీ శివదేవస్వామిని, శ్రీ పార్వతీ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అర్చకస్వాములు ర్యాలి శివరామకృష్ణ ప్రసాద్ (సిద్ధాంతి), ర్యాలి శివాజీ తదితరులు భక్తులకు సేవలందించారు. అలాగే దిగమర్రులోని శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీ నరేంద్రస్వామివార్ల ఆలయంలోనూ మహిళలు కార్తీక మాస పూజలు చేశారు.

కిక్కిరిసిన గోదావరి తీరం

నరసాపురం: కార్తీకమాసం ప్రారంభరోజు శనివారం రావడంతో పాడ్యమి పూజలు నరసాపురం గోదావరి తీరంలో ఘనంగా జరిగాయి. వశిష్ఠ గోదావరి వలందర్‌రేవు భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున పవిత్ర గోదావరి స్నానాలు చేసి రేవులో పూజలు చేశారు. గోదావరిలో దీపాలు వదిలారు. అనంతరం శివాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కపిలమల్లేశ్వరస్వామి ఆలయం, అమరేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెనుగొండలో..

పెనుగొండ: పవిత్ర కార్తీక మాసం శనివారం ప్రారంభం కావడంతో సిద్ధాంతం కేదారీఘాట్‌లో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించారు. తెల్లవారుజామునే వందలాది మంది మహిళలు కేదరీఘాట్‌కు తరలి వచ్చారు. పుణ్యస్నానాలు అనంతరం దీపాలు వెలిగించి కార్తీక ధీపాలను వశిష్టాగోదావరిలో వదిలారు. కేదారేశ్వరుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పెనుగొండ శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీనగరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి అలంకరించారు. ఆచంటలోని రామేశ్వర స్వామి ఆలయంలోనూ కార్తీక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో తొలిరోజు కార్తీక పురాణం పఠించారు.



మొగల్తూరు: పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలలో ప్రత్యేకాలంకరణలో శివదేవస్వామి



పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వరుని ఆలయంలో కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు



పెనుగొండ: సిద్ధాంతం కేదారీఘాట్‌లో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ఆచంటలో డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రపంచ శాంతికి దేశాల మధ్య సమైక్యతకు విఘాతం కలిగిస్తున్న అమెరికా ఇజ్రాయెల్ దేశాల దుర్మార్గ విధానాలను దేశ ప్రజలంతా గర్హించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎన్ శర్మ అన్నారు. డీవైఎఫ్ఐ 4వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రెండవ రోజు శనివారం ఆచంటలో సంత మార్కెట్ వద్ద పతాకాన్ని ఆవిష్కరించి యువతతో సమావేశం నిర్వహించారు. సామ్రాజ్యవాద విధానాలతో ప్రపంచ దేశాల మీద ఆధిపత్యం చెలాయించాలనుకొంటున్న అమెరికన్, ఇజ్రాయెల్ దేశాలు యుద్ధోన్మాదంతో అంతర్జాతీయ న్యాయస్థానాల చట్టాలను, ఐక్యరాజ్య సమితి తీర్మానాలను తుంగలో తొక్కి క్యూబా, పాలస్తీనా దేశ ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు ఎ.సురేష్ బాబు, పి.మోహన్, ఐ.దిలీప్, బి.దుర్గా ప్రసాద్, టి.పల్లపురాజు, జి.లాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అడవిపాలెంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు

యలమంచిలి: సంక్రాంతి పండుగ నాటికి రాష్ట్రంలో గుంతలు లేని రహదారులను నిర్మిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు, దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డుకు రూ.30 లక్షలతో అడవిపాలెం వద్ద మరమ్మతులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన రోడ్ల మరమత్తు పనులకు రూ.800 కోట్లు కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, చెరుకూరి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



మొగల్తూరు వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

మొగల్తూరు: కార్తీకమాసం ప్రారంభం కావడంతో పాటు స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో శనివారం స్థానిక వేకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ అర్చకులు గంగ పవన్ ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్వామి వారి దర్శనానికిక తరలివచ్చిన భక్తులు స్వామి వారిని దర్శింకుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేములదీవిలో..

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం సందర్భంగా స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.